సాక్షి

వైఎస్ఆర్ జిల్లా

శనివారం, 13, మే, 2023



సాంగ్యాల వివాదం.. జాతరకు విరామం

రాజంపేటలోని బలిజపల్లె గంగమ్మ ఆలయ నిర్వహకుల మధ్య వివాదం నెలకొనడంతో జాతరపై సందిగ్ధత ఏర్పడింది. -IIలో..



పచ్చి రొట్ట సాగు.. భూమి బాగు

రైతులు భూమి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు పచ్చి రొట్ట ఎరువులను సాగుకు ముందుకొస్తున్నారు. -IIలో..



బూతులు తిట్టాడని హత్య చేశారు

తాగిన మైకంలో ఒకరినొకరు బండబూతులు తిట్టుకుని మొదలైన వివాదం ఓ యువకుడి హత్యకు దారితీసింది. -IIలో..

అమాయకులతో ఫుట్‌బాల్

- యథేచ్ఛగా సైబర్ నేరగాళ్ల ఆటలు
- జీవీఫుట్‌బాల్, మూన్‌ఫుట్‌బాల్ యాప్‌లతో మోసాలు
- రెండేళ్ల క్రితం మేకింగ్ యాప్ ద్వారా రూ. కోట్లు కొల్లగొట్టిన వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



కడప అర్బన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు తమ చేతికి మట్టి అంటకుండానే రోజువారిగా లక్షలాది రూపాయలను అమాయక ప్రజల చేత పెట్టుబడుల రూపంలో పెట్టించి, వారికి రెట్టింపు డబ్బులను ఇస్తామనీ ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు. రోజుకో ఆన్‌లైన్ గేమ్ యాప్‌ను ప్రత్యక్షమయ్యేలా చేసి లక్షలాది రూపాయలను దండుకుంటున్నాడు. మొన్న మేకింగ్ యాప్, నిన్నటి వరకు జీవీ ఫుట్‌బాల్ యాప్, తాజాగా ఆన్‌లైన్ గేమ్‌గా మూన్ ఫుట్‌బాల్ యాప్ ప్రత్యక్షమైంది.

మేకింగ్ మనీ యాప్ పేరిట..

జిల్లాలో 2020- 21 సంవత్సరాల్లో ఆర్‌సీసీ మేకింగ్ యాప్ అనే ఆన్‌లైన్ యాప్ ప్రవేశించి కోట్లాది రూపాయలను సైబర్ నేరగాళ్లు దండుకున్నారు. ఇంట్లోనే ఉంటూ సులువుగా డబ్బులను సంపాదించండి అంటూ ఆర్‌సీసీ మేకింగ్ మనీ యాప్ పేరిట సెల్‌ఫోన్‌లకు లింకులు పంపి అమాయకప్రజల నుంచి డబ్బులు దండుకుని మోసాలకు తెగబడ్డారు. ఎట్టకేలకు ఈ యాప్ కేసులో సైబర్ నేరగాళ్లుగా గుర్తించిన తమిళనాడులోని నామక్కల్‌కు చెందిన గోకుల్ వెండన్, ఈరోడ్‌కు చెందిన మురుగానందన్‌లను 2021 అక్టోబర్6న అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులకు సంబంధించిన 23 బ్యాంకు ఖాతాలను గుర్తించి, అందులోని రూ. 62.5 కోట్లు ఫ్రీజ్ చేశారు. ఈయాప్‌కు సంబంధించి కడప వన్‌టౌన్, చాపాడు, మైదుకూరు, దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన నాలుగు కేసుల్లో దాదాపు 100 మంది బాధితులకు నిందితులు రూ. 11 కోట్లు కుచ్చుటోపీ పేట్టారు.

- మేకింగ్ మనీ యాప్, ఆర్‌సీసీ, ఇతర యాప్‌ల పేరిట ఎస్ఎంఎస్‌ల ద్వారా లింకులను పంపుతారు. ఈ లింక్‌లను క్లిక్ చేసి, పెట్టుబడి పెడితే కమీషన్ ద్వారా అధికమొత్తంలో ఆదాయం పొందవచ్చని ఊరిస్తారు. రిజిస్టర్ చేసుకుని, యాప్ ఓపెన్ చేసి తర్వాత ట్రేడింగ్ టాస్క్ పేరిట వస్తువును ఆన్‌లైన్‌లో కొనేందుకు టాస్క్‌ను బట్టి పెట్టుబడి పెట్టాలని చెబుతారు. టాస్క్‌లో పాల్గొని అధికమొత్తంలో డబ్బులు కమీషన్ రూపంలో సంపాదించాలనే ఆశతో బాధితులు నమ్మి డబ్బులు పెట్టుబడిగా పెడతారు.
- ప్రారంభంలో కమీషన్ రూపంలో కొంత మొత్తాన్ని పంపిస్తారు. ఇలా డబ్బులు నిజంగా వస్తాయేమోనన్న ఆశతో మరింత పెద్ద మొత్తంలో తమ ఇళ్లలోని బంగారు ఆభరణాలు కుదువకు పెట్టి, స్థలాలు, ఇళ్లు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులను పెట్టారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా చాట్ చేస్తూ మోసాన్ని కొనసాగించారు.
- టాస్క్ అతి సులువుగా వుండటంతో చాలా మంది తమ సన్నిహితులతో పెట్టుబడి పెట్టిస్తారు. డబ్బులను కూడా వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏఐడీ) ద్వారా నిందితుల ఖాతాల్లోకి డిపాజిట్ చేయించుకుంటారు.
- ఆర్‌సీసీ, మనీ మేకింగ్, ఇతర యాప్‌లలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లు కనిపిస్తుంది. ఇదంతా ఫేక్ డిస్‌ప్లే. అప్పటికే బాధితుల మొత్తాన్ని ఇతర ఖాతాలకు తరలించి, సైబర్ నేరగాళ్లు దాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చుకుంటారు.

జీవీ ఫుట్‌బాల్ పేరిట నయామోసం

గత ఏడాదిలో జీవీ ఫుట్‌బాల్ యాప్ అనంతపురం జిల్లా నుంచి జిల్లాలో ప్రవేశించింది. జీవీ ఫుట్‌బాల్ యాప్ పేరిట రోజూ వేల రూపాయలు సంపాదించుకోవచ్చని జిల్లాలో పలువురిని నమ్మించి మోసం చేశారు. ఈ ఆన్‌లైన్ గేమ్ ద్వారా జిల్లాలోని అమాయక ప్రజలు నష్టపోకూడదని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆధ్వర్యంలో కడప వన్‌టౌన్‌లో సుమోటోగా కేసును నమోదు చేశారు. ఇప్పటివరకు దాదాపు 12 మంది ఈవెంట్ ఆర్గనైజర్లను అరెస్ట్ చేశారు. వారి బ్యాంక్ ఖాతాల్లోని రూ. 20 లక్షలను ఫ్రీజింగ్ చేయించారు.

- జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టిన పెట్టుబడికి 24 రోజుల్లోనే రెట్టింపు డబ్బును తమ ఖాతాల్లో జమచేసేవారు. విత్‌డ్రాలు పెట్టే మొత్తంలో 12 శాతం డబ్బును టాక్స్ రూపంలో పట్టుకుని సభ్యుల ఖాతాల్లో వేసేవారు. ప్రమోషన్స్ జరపడానికి ఈవెంట్స్ పేరుతో డబ్బులను అదనంగా టీమ్ లీడర్స్ ఖాతాలో వేసేవారు. తద్వారా ప్రమోషన్స్ పేరుతో జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో చేరి వేలాది నుంచి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టారు. జిల్లాలోనే దాదాపు రూ. 10 కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టారని అనుకుంటున్నారు. ఈ యాప్ ప్రధాన నిర్వాహకులను పట్టుకుంటే నిజానిజాలు తెలుస్తాయి.

లింక్‌లతో మోసపోయి పెట్టుబడులు పెట్టొద్దు

లింక్‌లతో కూడిన యాప్‌లు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉండవు. సైబర్ నేరగాళ్లు స్వంతంగా తయారు చేస్తారు. యాప్ లేదా సంస్థ వ్యవస్థాపకుడు ఎవరు అనే సమాచారం ఎక్కడా అందుబాటులో ఉండదు. సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు యాప్‌లో ఎక్కడా లభ్యం కావు. యాప్ నిర్వాహకులను లేదా సిబ్బందిని సంప్రదించేందుకు ఎలాంటి కాంటాక్ట్ డీటైల్స్ లేవు. యాప్‌లో సర్టిఫికెట్లు, ఆధారాలు నకిలీవిగా గుర్తించారు. ఈ యాప్‌నకు యాక్టివ్‌గా సోషల్ మీడియాలో ఎక్కడా ఎలాంటి ఖాతాలు లేవు. ఈవెంట్లు నిర్వహించిన సమయంలో మాత్రమే ఆర్గనైజర్లు అప్‌లోడ్ చేసే ఫోటోలను వారు క్రియేట్ చేసుకున్న గ్రూప్‌లోనే ప్రదర్శింపచేస్తారు. ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టిన తరువాత వచ్చే లాభాలు, వ్యాపార కార్యకలాపాలన్నీ పక్కా చీటింగ్‌లా భావించేలా ఉన్నాయి.

- పోలీసులు చర్యలు చేపట్టిన తరువాత జీవీ ఫుట్‌బాల్ యాప్ సభ్యులకు ఓ ప్రకటనను పంపించారు. దీని ప్రకారం సభ్యుల ఖాతాలలో ఉన్న డబ్బులు విత్‌డ్రాలు పెట్టాలంటే ముందస్తుగా 12 శాతం ట్యాక్స్ కట్టాల్సిందేననీ తెలియజేశారు. అప్పటి నుంచి సభ్యుల ఖాతాల నుంచి విత్‌డ్రాలు కావడంలేదు. ఇంకా సభ్యులను మభ్యపెట్టేందుకు ఆన్‌లైన్ గేమ్‌లో తమ ఐడీలలోని డబ్బులను 'గేమ్ ప్లాన్'లో పెడుతూనే ఉండాలని సూచనలు చేస్తూ వచ్చారు.

ఆన్‌లైన్‌లోకి 'మూన్ ఫుట్‌బాల్ గేమ్'

జీవీ ఫుట్‌బాల్ కథ ముగిసిందని అనుకుంటున్న సమయంలోనే.. మరో ఆన్‌లైన్ గేమ్ ప్లాన్ లింక్‌లు 'మూన్ ఫుట్‌బాల్'పేరిట సైబర్ నేరగాళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిని చూసి ప్రజలు మోసపోవద్దనీ ఇప్పటికే జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో ప్రజలను ఎప్పటికపుడు సైబర్ నేరాల బారిన పడవద్దని సూచిస్తున్నప్పటికీ పెట్టుబడులను పెడుతూ మోసపోతున్నారు. 2021లో ఆర్‌సీసీ మనీ మేకింగ్ యాప్ నిర్వాహకులను పట్టుకుని అరెస్ట్ చేశాం. జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో ప్రజలు మోసపోకుండా సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టాం. ఏదైనా యాప్ ప్లే స్టోర్‌లో అందుబాటులో లేకుండా కేవలం నిర్వాహకులు ఇచ్చే లింక్‌ల ద్వారా విస్తరణ చేసే యాప్‌ల జోలికి వెళ్లరాదు. ఇలాంటి యాప్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. – కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లో సబ్జెక్టు టీచర్స్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు 13వ తేదీ వరకు గడువు పొడగించినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులలో పీజీ అర్హత కలిగి, జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ, జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను 13వ తేదీ సాయంత్ర 5 గంటల్లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలని డీఈఓ తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న (శనివారం) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలను ఏర్పాటు చేశారు. కడపలో ఐదు, ప్రొద్దుటూరు మూడు, రాయచోటిలో మూడు, రాజంపేట 1, బద్వేల్ రెండు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, సిద్దవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కో బెంచీని ఏర్పాటు చేశారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622లో గానీ, ఈ మెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఈకోర్ట్.జీఓవీ.ఇన్/కడప.డీఎల్ఎస్ఏకేడీపీ అట్‌దిరేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌లో సంప్రదించాలి. జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రేపటి నుంచి ఏనుగుమల్లమ్మ ఉత్సవాలు



ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: ప్రఖ్యాత వేసవి విడది కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కలు తీర్చుకుంటారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు కొండపైకి దీలు మోసుకొచ్చి ఏనుగుమల్లమ్మకు సమర్పిస్తారు. ఉత్సవపల్లకిలో అమ్మవారి విగ్రహాన్ని కొండపై ఊరేగిస్తారు. ఉట్లమాను ఏర్పాటు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. మూడురోజులు ఏనుగుమల్లమ్మ విగ్రహానికి విశేష ఆలంకరణలు చేస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

16న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సీ–డ్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ లోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. అలీ డిక్సన్ టెక్నాలజీస్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, అపోలో ఫార్మసీలో రీటైల్ ట్రైనీ అసోసియేట్/ఫార్మసిస్టు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగుతాయన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఎం.ఫామ్, బి.ఫామ్, డి.ఫామ్ చదివిన వారు ఆయా ఉద్యోగాలకు అర్హులన్నారు. అభ్యర్థులు 18–30 సంవత్సరాల మధ్య వయసున కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9908808914 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆలిండియా ఖోఖో టెక్నికల్ వర్కుషాపునకు ఎంపిక



కృష్ణయ్య

కడప స్పోర్ట్స్: ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు వరంగల్ జిల్లాలోని వాగ్దేవి విద్యాసంస్థల్లో నిర్వహించనున్న ఆలిండియా ఖోఖో టెక్నికల్ అఫిషియల్స్ వర్కుషాపునకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నందలూరు జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ సూరె కృష్ణయ్య ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ సమావేశంలో ఖోఖో క్రీడకు సంబంధించిన సాంకేతిక అంశాలు, అధునాతన మార్పులు, చేర్పులపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఏపీ ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈయన ఎంపిక పట్లకు జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి జె. నరేంద్ర, పాఠశాల హెచ్ఎం జి. శ్రీనివాసులు అభినందనలు తెలిపారు.

గడువులోపు నిర్మాణాలు పూర్తి కావాలి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలునాయక్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర భవన నిర్మాణాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బాలునాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఎస్ఈ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, ఏఈలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీఎంజీఎస్‌వై, ఈఏపీ కింద మంజూరైన బీటీ రహదారుల పనులను అగ్రిమెంటు కుదుర్చుకున్న సమయంలోపే పూర్తి చేయాలని చెప్పారు. రహదారులు, భవన నిర్మాణాలు నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్ పర్యవేక్షక ఇంజనీరు శ్రీనివాసులురెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు రామచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, శ్యాం సుందర్‌రాజు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకం

కడప అగ్రికల్చర్: పుట్టగొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డాక్టర్ వీరయ్య సూచించారు. శుక్రవారం ఊటుకూరులోని కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శాస్త్రవేత్త శిల్పకళ రైతులకు శిక్షణను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ గతంలో శిక్షణ పొందిన రైతులు ఈ పుట్టగొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని మంచి లాభాలు గడిస్తున్నారన్నారు.ముత్యపు చిప్ప, పాల పుట్టగొడుగులకు మంచి ఆదరణ ఉందన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పుట్టగొడుగులు తినడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారని, రైతులు దీనిని కుటీరపరిశ్రమగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

ఊటీ, మైసూర్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసులు



మదనపల్లె సిటీ: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని ఊటీ,మైసూర్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ- 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 20న మదనపల్లె నుంచి బయలుదేరి బెంగళూరు వండర్‌లాకు వెళుతుందన్నారు. సాయంత్రం మైసూర్ లేజర్‌షో చూశాక చాముండి హిల్స్‌కు వెళ్లి, 21న జూ, ప్యాలెస్ చూసి అక్కడి నుంచి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీ రూ.4700 చెల్లించాలన్నారు. 24న మరోబస్సు మదనపల్లె నుంచి ఊటీకి బయలుదేరుతుందన్నారు. అక్కడ పలు ప్రాంతాలు తిలకించిన అనంతరం 27న మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు. వివరాలకు 7382875034, 9440858510 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వివాహ నమోదు.. మరింత సులువు

- మాన్యువల్ విధానానికి స్వస్తి పలికిన ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లకుండానే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
- వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు
- ఇంటికే వివాహ పత్రాలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. గతంలో వివాహ పత్రాలు కావాలంటే నెలరోజుల ముందే రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయితే ప్రభుత్వం 2023 జనవరి నుంచి ఈ మార్పును తీసుకు వచ్చింది. రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లకుండానే ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవడం, ఆ తర్వాత డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి ప్రక్రియను కొనసాగించవచ్చు. వివాహాల రిజిస్ట్రేషన్ విధానంలో గతంలో ఉన్న మ్యానువల్ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. గతంలో వివాహాల రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ అనేక ఇబ్బందులు పడాల్సి ఉండేది. అయితే హిందూ ప్రత్యేక వివాహాలకు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో మ్యాన్యువల్ విధానంలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉండేది. వరుడికి 21 సంవత్సరాలు, వధువుకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వారి ఫొటోలు, ఆధార్‌కార్డు, పదవ తరగతి ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురు సాక్షులతో దరఖాస్తును పూర్తి చేసి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇచ్చేవారు. వాటిని సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి సంతకం చేసిన తర్వాత వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసేవారు. ఇకపై నేరుగా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో సులభంగా రిజిస్ట్రేషన్

ప్రస్తుతం ఆన్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చింది. ఇంటివద్ద నుంచే వివరాలను పొందుపరిచి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.రిజిస్ట్రేషన్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రెండు ఆప్షన్లు ఉంటాయి. హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ నంబరు లేదా ఈ–మెయిల్ ద్వారా ఓటీపీతో లాగిన్ కావాలి. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి ఆధార్‌కార్డులు, దరఖాస్తుదారుల ఫొటోలు, పదవ తరగతి ధ్రువీకరణపత్రాలను అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేందుకు శ్లాట్‌ను బుక్ చేసుకుని సీఎఫ్ఎంఎస్ ద్వారా ఫీజు చెల్లించాలి. తర్వాత ఆ దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వారు పరిశీలించి సాక్షులతో సంతకాలు పెట్టించుకుని వెంటనే ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక వివాహ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లోనే డిస్‌ప్లే అవుతుంది. దీనికోసం సబ్ రిజిస్ట్రార్ సాధారణ సంతకం కాకుండా డిజిటల్ సంతకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు.

ప్రత్యేక వివాహాలకు..

హిందూ వివాహ పద్ధతిలో జరగని వివాహాలను ప్రత్యేక వివాహాలుగా పరిగణిస్తారు. వీటికి సంబంధించి దరఖాస్తు విధానం మరోలా ఉంటుంది. దీనికి నెలరోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. అభ్యంతరాలు తెలుసుకునేందుకు నెలరోజులపాటు నోటీసు బోర్డులో ఉంచుతారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే యథావిధిగా ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారు.

జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

వైఎస్సార్ జిల్లాలో కడప అర్బన్, రూరల్, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, వేంపల్లె, కమలాపురం, దువ్వూరు, సిద్దవటం, ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివాహ నమోదు పత్రాలను పొందవచ్చు.



కడపలోని రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయం

సద్వినియోగం చేసుకోవాలి




ఈ ఏడాది జనవరి నుంచి ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చింది. వివాహ ధ్రువీకరణ పత్రాలు కావాలనుకునే దంపతులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని శ్లాట్‌ను బుక్ చేసుకోవాలి. అందుకోసం అవసరమయ్యే రుసుమును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఆ తర్వాత వెబ్‌సైట్ నుంచే వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి. నూతన జంటలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, కడప

స్త్రీనిధి..ప్రగతికి పెన్నిధి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. పొదుపు సంఘంలో సభ్యులైన మహిళలకు స్త్రీ నిధి ద్వారా జీవనోపాధుల కోసం రుణాలను అందజేస్తారు. గత ప్రభుత్వ హయాంలో రుణం చాలా తక్కువగా ఉండేది. ఒక్కో గ్రూపునకు లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో గ్రూపులో ఏడుగురు సభ్యులకు లక్ష చొప్పున రూ.7 లక్షలు ఇస్తున్నారు. దీనిపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒక్కో గ్రూపునకు రూ.7లక్షల రుణం
- పైసా ఖర్చు లేకుండా మంజూరు
- గత ప్రభుత్వంలో ఒక గ్రూపునకు రూ.లక్ష మాత్రమే



సంవత్సరాల వారీగా మంజూరు చేసిన స్త్రీ నిధి రుణాలు
2020-21లో అందజేసిన రుణాలు: రూ.102.51 కోట్లు
2021-22లో అందజేసిన రుణాలు: రూ.122.95 కోట్లు
2022-23లో అందజేసిన రుణాలు: రూ.111.63 కోట్లు
2023-24లో లక్ష్యం: రూ.160 కోట్లు

కడప కార్పొరేషన్/రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్త్రీనిధి రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను స్త్రీ నిధి రుణాలు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నాయి. కొందరు పిల్లల చదువులు, వివాహాలకు, మరికొందరు జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు. జిల్లాలోని 49 మండలాల్లో 37వేల స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు 1,19,687 మందికిపైగా మహిళలు రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్త్రీ నిధి రుణాలు నలుగురు నుంచి ఐదుగురు సభ్యులకు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మొత్తం కలిపి లక్షల రూపాయలు మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక్కో మహిళ లక్ష రూపాయలు వరకూ తీసుకునే సౌలభ్యం కల్పించారు. గ్రూపులో ఏడుగురు సభ్యులకు మొత్తం రూ.7లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. అంతేగాక అబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు ఇలా...

మహిళల జీవనోపాధులు పెరిగేలా ప్రస్తుతం అతి తక్కువ శాతం వడ్డీపై స్త్రీ నిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటి నుంచే రుణాలు పొందే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు కూడా లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.160 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే రూ. 50కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే భారం ఇతర సభ్యులపై పడకుండా ఆమె చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తున్నారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకొని చెల్లించే వడ్డీతో స్త్రీ నిధి సంస్థకు లాభాలు వస్తున్నాయి. వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని గ్రామ సంఘాలు (వీఓఏ), మండల సమాఖ్యలకు కేటాయిస్తున్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మహిళల జీవనోపాధుల అభివృద్ధి కోసం ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలు ఇస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 34వేల మంది సభ్యులకు రూ.160 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికే రూ.50 కోట్లకుపైగా రుణాలు అందజేశాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఈ నిధులను పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి.
– ఆనంద్ నాయక్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మండీబజార్‌లో నివాసం ఉంటున్న కోటా సురేష్‌బాబు (48) అనే వ్యక్తి ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి కనిపించడంలేదని శుక్రవారం సాయంత్రం అతని భార్య సత్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్న సురేష్‌బాబు అప్పులు ఎక్కువగా చేశాడని తెలిపింది. ఈనెల 11వ తేదీ సాయంత్రం రాజా అనే వ్యక్తి డబ్బులు అడిగి తన భర్తతో గొడవపడ్డాడని, తరువాత రాత్రి ఇంటికి వచ్చి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయరాములు తెలిపారు.

భర్త, అత్తమామలపై కేసు

కడప అర్బన్ : కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసు నమోదైంది. సరోజినీనగర్‌కు చెందిన ప్రశాంత్ ఏడు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన రూప అనే యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భర్తతో పాటు, అత్తమామలు సలోమి, సత్యరాజ్‌లు వరకట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నారని బాధితురాలు రూప రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత



పిల్లలను తల్లిదండ్రులను అప్పగిస్తున్న టూ టౌన్ సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : ఆడుకుంటూ బైపాస్ రోడ్డులోకి వచ్చి తప్పిపోయిన పిల్లలను టూ టౌన్ పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాసులు, శశికళ దంపతులకు పద్మావతి, వైష్ణవి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం సాయంత్రం ఇద్దరు పిల్లలు ఇంటి బయట ఆడుకుంటూ సమీపంలోని బైపాస్ రోడ్డులోకి వచ్చారు. ఇల్లు కనుక్కోలేక పిల్లలిద్దరూ రోడ్డు పక్కన ఉండగా దేవీ అనే మహిళ వారిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సీఐ ఇబ్రహీం తమ సిబ్బందిని పంపించి పిల్లల తల్లిదండ్రులను గుర్తించారు. వారిని స్టేషన్‌కు పిలిపించి కుమార్తెలను అప్పగించారు. తమ పిల్లలను క్షేమంగా అప్పగించినందుకు వారు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

సాంగ్యాల వివాదం.. జాతరకు విరామం

- బలిజపల్లె గంగమ్మ జాతర కోసం లక్షలాదిమంది భక్తుల ఎదురుచూపు
- నిర్వాహకుల మధ్య కొనసాగుతున్న సాంగ్యాల పంచాయితీ

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఏటా నిర్వహించే గంగమ్మ జాతరకు రెండువందల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. అయితే అమ్మవారికి సమర్పించే సాంగ్యాల విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా కొంతమంది జాతర నిర్వాహకుల మధ్య వివాదం నెలకొంది. గత ఏడాది జాతరకు అంకురార్పణ చేసే తరుణంలో నిర్వాహకులు ఘర్షణలకు దిగడంతో అప్పట్లో ఆ కార్యక్రమాన్ని పోలీసులు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో గత ఏడాది జాతర నిర్వహణకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, అప్పటి ఆర్డీఓ కోదండరామిరెడ్డి, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిలు నిర్వాహకులతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి పాతపద్ధతుల్లో ఎవరు ఏయే సాంగ్యాలు చేస్తారో ఆ సాంగ్యాలతోనే జాతర చేయాలని గట్టిగా హెచ్చరించారు. అనంతరం అధికారులు నిర్వాహకులు నిర్వహించే సాంగ్యాలకు సంబంధించి జాబితాను కూడా తయారు చేసి ఇచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గట్టి చర్యలు తీసుకోవడంతో గత ఏడాది నిర్వాహకులు జాతర చేశారు. అయితే ఈ ఏడాది కూడా నిర్వాహకుల మధ్య సాంగ్యాల సమస్య తలెత్తి జాతర విషయమై పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా ఈ ఏడాది జాతర జరుగుతుందో లేదో అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచింది. లక్షమందికి పైగా జాతరలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. అందువల్ల ఇప్పుడు ఏ నలుగురు కలిసినా బలిజపల్లె జాతర గురించి మాట్లాడుకుంటున్నారు. బలిజపల్లె గంగమ్మ జాతరను శివరాత్రి తరువాత మార్చి, ఏప్రిల్ నెలల్లో మరీ ఆలస్యమైతే మే నెల మొదటి వారంలో నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు మేనెలలో సగం రోజులు పూర్తవుతున్నా నిర్వాహకులు మాత్రం జాతర విషయమై ఎలాంటి చర్చలు జరపలేదు. దీంతో ఈ ఏడాది జాతర జరిగే అవకాశాలు చాలా వరకు సన్నగిల్లాయని అనేక మంది భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్ చొరవ చూపాలి

నిర్వాహకుల తీరు కారణంగా ఎంతో ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర ఆగిపోకుండా జరిగేలా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఈ ఏడాది కూడా తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. జాతర నిర్వహణ విషయంలో ఏటా నిర్వాహకులు వివాదాలకు వెళ్లకుండా శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జాతర విషయంలో పంతాలు వీడాలి



బలిజపల్లె గంగమ్మ జాతర ఎంతో ఘనంగా జరుగుతుంది. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తారు. జాతర ఎప్పుడు జరుగుతుందా అని వేల మంది వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు సర్వం సిద్ధం చేసుకొని ఉన్నారు. నిర్వాహకులు గంగమ్మ జాతర విషయంలో పంతాలు వీడాలి.

– ఎస్.శివరామయ్య, రిటైర్డ్ పీఈటీ, రాజంపేట

జాతర కోసం లీవు కూడా అడిగి ఉన్నా



మా సొంతూరు రాజంపేటలోని బలిజపల్లె. మా ఊళ్లో జాతర ఎంతో ఘనంగా జరుగుతుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జాబ్ చేస్తున్నా. గంగమ్మ జాతర ఎప్పుడు జరిగినా నాకు లీవు ఇవ్వాలని మా ఆఫీసులో పర్మిషన్ అడిగి ఉన్నా. నాకు జాబ్ వచ్చినందున ఈ ఏడాది జాతలో భక్తులకు అన్నదానం చేయాలనుకుంటున్నాను.

– లేబాకు సాయిప్రసన్న, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఆభరణాలు వెనక్కి తీసుకుంటాం



బలిజపల్లె గంగమ్మకు సంబంధించి కొన్ని ఆభరణాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం అమ్మవారి ఆభరణాల వివరాలు నిర్వాహకులు మాకు రాతపూర్వకంగా రాయించి ఇచ్చారు. ఒకవేళ జాతర నిర్వహించకుంటే ఆభరణాలను మేము శాఖాపరమైన చర్యలతో స్వాధీనం చేసుకుంటాము. నిర్వాహకులు జాతరను చేయకుంటే ఎవరైనా జాతర చేయమని మమ్మల్ని కోరితే భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతర నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలిస్తాము.

– విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ, అన్నమయ్య జిల్లా

బైకులు ఢీ.. వ్యక్తి మృతి



చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని విశ్వనాథపురం నుంచి బుగ్గరింగ్‌రోడ్డు సర్కిల్‌కు వెళ్లే రహదారిలో శుక్రవారం రెండు బైకులు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. సీకేదిన్నె ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని జేవీ నగర్‌కు చెందిన ఎస్.కంతయ్య (32) కూలి పనులు చేసుకుని బైకుపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కంతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఇదే ప్రమాదంలో మరో స్కూటరిస్టు వెంకటసుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం సేవించి యువకుడి మృతి



మృతి చెందిన శ్రీకాంత్

పుల్లంపేట : రాజంపేటకు చెందిన శ్రీకాంత్ (23) అనే యువకుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని రెడ్డిపల్లి మద్యం షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి సమీపంలోని స్మశానం వైపు వెళ్లి అక్కడ మృతి చెందాడు. విషయాన్ని గమనించిన గ్రామస్తులు పుల్లంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పుల్లంపేట ఎస్‌ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారు

కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వెల్లడి

కడప అర్బన్ : కమలాపురం పరిధిలో గత నెల 7వ తేదీన జరిగిన వైఎస్సార్‌సీపీ కమలాపురం 20వ వార్డు ఇన్‌చార్జి కరంగుడి జయశంకర్‌రెడ్డి(49) హత్య కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారని కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్ వెల్లడించారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలగడ్డ ప్రాంతంలో పొలంలో పనులకు వెళ్లిన జయశంకర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీకి చెందిన పల్లె శేఖర్‌రెడ్డితోపాటు ఇంకా కొంతమంది కలిసి వెళ్లి పథకం ప్రకారమే దారుణంగా హత్య చేశారన్నారు. ఈ సంఘటనలో హతుడి కుమారుడు కరంగుడి నవీన్ కళ్యాణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు చట్ట ప్రకారం హత్య కేసును నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాజకీయపార్టీ నేతలు పోలీసులపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని, ఈ విధానం మంచిది కాదని ఆయన తీవ్రంగా ఖండించారు. హత్య సంఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న హతుని కుమారుడు ఫిర్యాదులో ఇచ్చిన పేర్లను మాత్రమే నిందితుల జాబితాలో చేర్చి వారిపైన మాత్రమే చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కేసులో ఇంకా కొందరు అరెస్ట్ కావాల్సి ఉందన్నారు. ఈ హత్య వ్యక్తిగత, పాత కక్షల వల్లనే జరిగిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమలాపురం సీఐ పి. సత్యబాబు, ఎస్‌ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

భూవివాదంలో కిరాయి రౌడీలు అరెస్ట్

మదనపల్లె : మండలంలోని కురవంక పంచాయతీలోని భూవివాదంలో తిరుపతికి చెందిన ఐదుగురు కిరాయిరౌడీలను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ శివారు ప్రాంతమైన కురవంక సర్వే నంబర్.420లో భూమికి సంబంధించి ఇద్దరి మధ్య వివాదం నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు భూమిలో పనులు చేస్తుండగా, మరో వర్గానికి చెందిన వ్యక్తులు తిరుపతి నుంచి కొందరు కిరాయిరౌడీలను తీసుకువచ్చి పనులను అడ్డుకున్నారని చెప్పారు. దీంతో పట్టణానికి చెందిన సునీత తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితులను అరెస్టు చేశారు.

భూ వివాదంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతి రామాపురంలో భూమి తగాదా విషయంలో ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఉమాశంకర్ అనే వ్యక్తి పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని దున్నుతుండగా వెంకటరెడ్డి దాడికి పాల్పడటంతో తల కు రక్త గాయమైంది.

ఈవీఎంలు లేకుండా ఎన్నికలకు బీజేపీ సిద్ధమా ?

ఎర్రగుంట్ల : ఈవీఎంలు లేకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలకు బీజేపీ సిద్ధమా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. శుక్రవారం ఎర్రగుంట్లలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రావడానికి ఎన్ని అడ్డదారులు ఉంటే అన్నింటిని ఉపయోగించుకునేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఈవీఎంలు, కులం, మతం, భాష ఇలా అన్నింటిని నిస్సిగ్గుగా వాడుకుంటోందన్నారు. కర్ణాటకలో అధికారంలోకి రావడానికి ముస్లింల 4 శాతం రిజర్వేషన్‌లను రద్దు చేసిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగంలోని ఎల్‌ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, రోడ్లు గనులు, ఇలా దేన్నీ వదలకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, ఎంవీ సుబ్బారెడ్డి, ద్రవిడ, సురేష్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

కురబలకోట : ఒంటరితనం భరించలేక మండలంలోని చిన్నపరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్న వెంకట్రమణారెడ్డి (79) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు..చిన్న వెంకట్రమణారెడ్డి సాధారణ రైతు. ఇతని భార్య, కుమారుడు ఇదివరకే మృతి చెందారు. విధిలేని పరిస్థితిలో కోడలు అమ్మిన్నమ్మ కుమారుడితో కలసి బతుకు దెరువు కోసం బెంగళూరు వెళ్లింది. అప్పటి నుంచి ఇతను ఒక్కడే ఒంటరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వయసు మీద పడడటం, ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం ఆపై ముఖ్యంగా ఒంటరితనం వేధించసాగింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు.

బూతులు తిట్టాడని హత్య చేశారు

- వీడిన వెల్డర్ అక్రమ్ హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

మదనపల్లె : కర్ణాటక రాష్ట్రంలో పెట్రోల్‌బంకు వద్ద తాగిన మైకంలో ఒకరినొకరు బండబూతులు తిట్టుకుని మొదలైన వివాదం ఏపీ సరిహద్దులో ఓ యువకుడి హత్యకు దారితీసింది. నాలుగు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ మదనపల్లె-బెంగళూరు మెయిన్‌రోడ్డులో కూకటిమానుగడ్డ వద్ద హత్యకు గురైన అక్రమ్ కేసు మిస్టరీ శుక్రవారం వీడింది. హత్యకేసులో వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలానికి చెందిన వల్లూరు మహమ్మద్‌రఫీ, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన వల్లూరు మాబూషరీఫ్, కురబలకోటకు చెందిన వల్లూరు నవాజ్ షరీఫ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ కేశప్ప తాలూకా పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. శ్రీ సత్యసాయిజిల్లా తనకల్లు మండలం కోటూరుకు చెందిన పఠాన్‌అక్రమ్(23) పట్టణంలోని నక్కలదిన్నెలో నివాసం ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 7వ తేదీ అక్రం పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన ఖాదర్‌వలీ, రెడ్డిబాషా, మరికొందరితో కలిసి ఏపీ-03టీసీ-6107 ఆటోలో మదనపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు వెళ్లాడు. తిరిగి మదనపల్లెకు వస్తున్న క్రమంలో కర్ణాటక సరిహద్దులోని నయారా పెట్రోలు బంకులో ఆటోకు రూ.300కు పెట్రోల్ పోయించుకున్నారు. దీనికి సంబంధించి బిల్లు తీసుకునే విషయమై బంకు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అదే సమయానికి ఏపీ-21 ఏఎస్-5483 టాటా ఇండికా కారు డీజిల్ పట్టుకునేందుకు బంకులోకి వచ్చింది. డీజిల్ పట్టకుండా బంకు సిబ్బంది ఆటోలోని వ్యక్తులతో గొడవ పడుతుండగా, బిల్లు కోసం ఇంత రాద్ధాంతమా... తొందరగా డీజిల్ పట్టండి..మేము వెళ్లాలంటూ గట్టిగా మాట్లాడారు. దీంతో బంకు సిబ్బందితో గొడవ పడుతున్న అక్రమ్, రెడ్డిబాషాలు కారులోని వ్యక్తులైన మహమ్మద్ రఫీ, మాబూషరీఫ్, నవాజ్‌షరీఫ్‌లతో వాదులాటకు దిగారు. తీవ్రస్థాయిలో బూతులు మాట్లాడుకున్నారు. గొడవ పడేందుకు సిద్ధపడ్డారు. ఈలోపు అక్కడి స్థానికులు కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు గస్తీ అధికంగా ఉందని, గొడవలు పడితే అరెస్ట్ చేస్తారని చెప్పడంతో బార్డర్‌లో తేల్చుకుందాం రమ్మని సవాళ్లు విసురుకున్నారు. చెప్పినట్లుగానే ఆటో కర్ణాటక సరిహద్దు దాటి ఏపీలోకి ప్రవేశించగానే ఉగ్రాణంపల్లె వద్ద ఆటోకి అడ్డుగా ఇండికా కారును పెట్టారు. ఆటోలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించారు. దీంతో వాదులాటలో ఎక్కువగా తిట్టిన తనను ఎక్కడ కొడతారోనని అక్రమ్ ఆటో దిగి మదనపల్లె వైపు పారిపోయాడు. దీంతో కారులోని వ్యక్తులు అక్రమ్‌ను వెంబడించారు. కొంతదూరంలో కూకటిమానుగడ్డ వద్ద అక్రమ్ నడుచుకుంటూ మదనపల్లె వైపు పోతుండగా అతడి ముందుకు కారును పోనిచ్చి అతడిని పట్టుకుని తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ముగ్గురు వ్యక్తులు మృతదేహాన్ని రోడ్డుపక్కన చెట్టు పొదల్లో పడేసి పారిపోయారు. మరుసటిరోజు రోడ్డుపక్కన అక్రమ్ మృతదేహం కనిపించడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో గురువారం నిందితులు మదనపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్ బావాజాన్ వద్ద లొంగిపోయారు. తహసీల్దార్ ముగ్గురు నిందితులు, కారును తీసుకువచ్చి తాలూకా సీఐ సత్యనారాయణకు అప్పగించారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన మహమ్మద్ రఫీ పాతనేరస్తుడు. ఇతడిపై సింహాద్రిపురంలో గుట్కా, పక్కింటివారితో గొడవపడటం, ముదివేడులో భూతగాదాలో ప్రమేయంపై మూడుకేసులు నమోదై ఉన్నాయి. బీటెక్ పూర్తిచేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మాబూషరీఫ్ ఎంబీఏ చదువుకుని ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, నవాజ్ షరీఫ్ డిగ్రీ వరకు చదువుకుని అంగళ్లులో వ్యాపారం చేసుకుంటున్నాడు. నిందితులు ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల బిడ్డలు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, సీఐ

పచ్చి రొట్ట సాగు..భూమి బాగు

- జిల్లాలోని 36 మండలాలకు సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాల సరఫరా
- జిల్లా వ్యాప్తంగా 4781 క్వింటాళ్ల జీలుగలు
- 383 కిటాళ్ల జనుములు
- 170 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరు



సాగు చేసిన పచ్చి రొట్ట ఎరువుల పంట

వల్లూరు : రైతులు ఒకప్పుడు సేంద్రియ ఎరువుల ఆధారంగా పంటలను సాగు చేసేవారు. దీంతో ఏళ్ల తరబడి పంటలను సాగు చేసినా భూమి స్వభావం మారేది కాదు. మారిన కాల పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతుల పట్ల మొగ్గు చూపుతూ వచ్చిన రైతులు అధిక దిగుబడుల సాధన కోసం రసాయన ఎరువులు, పురుగు మందులను విచక్షణా రహితంగా వాడడం మొదలు పెట్టారు. దీంతో తాత్కాలికంగా అధిక దిగుబడులను సాధించి తృప్తి పడుతూ వచ్చినప్పటికీ భూమి ఆరోగ్యం గురించి నిర్లక్ష్య ధోరణి కనిపిస్తూ వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా పంటల సాగు ఇదే రీతిలో సాగడం వలన భూమి స్వభావంలో మార్పులు సంభవిస్తున్నాయి. భూమి నిస్సారంగా మారుతోంది. అదే విధంగా ఒకప్పుడు వర్షాధారం ద్వారా గానీ లేక కాలువలు, చెరువులు, నదులు, బావుల ద్వారా దాదాపుగా మంచి సారవంతమైన నీటిని పంటలకు ఉపయోగించే వారు. రాను రాను భూగర్భ జలాలు అడుగంటుతూ వస్తున్న తరుణంలో వేలాది అడుగుల లోతు వరకు బోర్లను వేసి ఆ నీటితో పంటలను సాగు చేయాల్సి వస్తోంది. ఇలా పలు కారణాల వలన భూమి స్వభావంలో తీవ్ర మార్పులు సంభవించడం, సాగు చేసిన పంటలను చీడ పీడలు అధికంగా ఆశించడం, దిగుబడులు గణనీయంగా తగ్గి పోవడం జరుగుతోంది.

పచ్చి రొట్ట సాగు వలన భూమి ఆరోగ్యం

ఈ క్రమంలో రైతులు భూమి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. నిస్సారంగా మారిన తమ పొలాలను సారవంతం చేసుకోవడానికి గల అవకాశాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా అనుభవజ్ఞులైన వ్యవసాయదారులు, వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు పచ్చి రొట్ట ఎరువులను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో భూమిలో కలియ దున్ని కుళ్లింప చేయడానికి అవకాశాలు ఎక్కుగా ఉండడంతో వరి రైతులు ఎక్కువగా వీటి సాగుకు ముందుకు వస్తున్నారు. వీటి సాగు వలన భూమి సారవంతం కావడమే కాక సేంద్రియ పదార్థాలను నేలకు తద్వారా పంటలకు అందించే అవకాశం వుంది. కలుపు మొక్కల వ్యాప్తిని తగ్గించడం, మొక్కలకు కావల్సిన అన్ని పోషక పదార్థాలను సక్రమంగా అందించే వ్యవస్థను మెరుగుపరచడం జరుగుతుంది.

సాగు ఇలా..

భూసారం పెంచడంలో సహాయకారిగా ఉండే పచ్చి రొట్ట పైర్లయిన జనుము, జీలుగలు, పిల్లి పెసర, అలసంద వంటి పంటలను సాగు చేయడానికి రైతులు ఇష్ట పడుతున్నారు. సేద్యం చేసిన పొలంలో జీలుగలు, పిల్లి పెసర విత్తనాలైతే ఎకరాకు 10 నుండి 12 కిలోలు, జనుము విత్తనాలు 16 కిలోల వరకు చల్లి నీటిని పెట్టాల్సి ఉంటుంది. తరువాత అవసరాన్ని బట్టి నీటిని కట్టాలి. అయితే ఇవి వర్షాభావ పరిస్థితుల్లో సైతం తట్టుకుని పెరుగుతాయి. జీలుగ, జనుము, పిల్లి పెసర సాగు వలన హెక్టారుకు దాదాపు 18 నుంచి 21 టన్నుల గ్రాసం దిగుబడి వస్తుంది. దీన్ని పశువుల మేతగా కూడా వాడుతున్నారు. ఎరువు కోసమైతే పచ్చి రొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియ దున్నాలి. పైరు వయసు 50 నుంచి 60 రోజుల లోపు కలియ దున్ని ఒకటి రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందడానికి అవకాశం ఉంటుంది.

నత్రజని వాడకం తగ్గించుకోవచ్చు

ప్రస్తుతం పొలాలకు రసాయనిక ఎరువుల రూపంలో అందిస్తున్న నత్రజని (యూరియా) వాడకాన్ని దాదాపు 20 నుండి 30 శాతం వరకు తగ్గించుకోవడం ద్వార ఆదా చేసుకోవచ్చు. దీనితో బాటు నేలలో నీరు , రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారి పోకుండా అడ్డుకట్ట పడుతుంది. నేలలో చౌడును తగ్గించడానికి సహాయకారిగా మారుతుంది.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ



నిస్సారంగా మారుతున్న నేల ఆరోగ్య రక్షణకు సహాయపడే పచ్చి రొట్ట ఎరువుల సాగును పెంచడంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. ఇందుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు కార్యక్రమం జరుగుతోంది. అది పూర్తి కాగానే విత్తనాలు అందజేస్తాం.

– నరసింహారెడ్డి, ఏడీఏ కమలాపురం.